పండుటాకులపై పగ

- టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రపై సర్వాత్రా ఆగ్రహం
- పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేయడంతో తీవ్ర ఆవేదన
- సచివాలయాలకు వెళ్లడం చాలా ఇబ్బంది అంటూ ఆక్రందన
- డబ్బుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పండుటాకులు

తగరపువలస : ప్రతీ నెలా ఒకటో తేదిన తెలతెలవారుతుండగానే ఇంటికి వచ్చి చేతిలో రూ.3 వేల పింఛన్ పెట్టే వలంటీర్ ఇప్పుడు ఇంటికి రాలేదు... మనమే ఎక్కడో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి క్యూలో నిల్చుని పింఛన్లు తీసుకోవాలట... ఇదెక్కడి దారుణం అంటూ అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు ఠంచన్‌గా ఇచ్చే వలంటీర్లను సేవల నుంచి తప్పించేందుకు కుట్రలు పన్నిన టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై పింఛనుదారులు మండిపడుతున్నారు. ఇదెక్కడి కుట్ర రాజకీయాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పండగ వచ్చినా, పబ్బం వచ్చినా, వరదలు వచ్చినా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి ముంగిట్లోనే పింఛన్ నగదు అందుకునేవారిమని... చంద్రబాబు కారణంగా ఈ నెల రెండు రోజులు గడిచినా పింఛన్లు అందలేదని పండుటాకులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఆసరా, భరోసా లేని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నెల వారీ ఖర్చులలో భాగంగా మందులు, నిత్యావసర సరకులు కొనుక్కునేందుకు రెండు రోజులు ఎదురు చూసినా ఫలితం లేకపోయింది. ఆకలితో అలమటించిన అభాగ్యులు ఎందరో వున్నారు. పింఛనర్లపై చంద్రబాబు, అతని బృందం కక్ష కట్టిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి నియోజకవర్గంలో గత ఐదేళ్లలో 45,575 మందికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.282.33 కోట్లు వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా పంపిణీ చేశారు.

ఇదీ నియోజకవర్గంలో పరిస్థితి

ప్రాంతం	లబ్ధిదారులు
భీమిలి అర్బన్	10307
భీమిలి రూరల్	5899
ఆనందపురం	8939
పద్మనాభం	8148
మధురవాడ జోన్	12282

పింఛన్ నగదే జీవనాధారం



నాకు పుట్టుకతేనే పోలియో. కర్ర ఊత పట్టుకుంటేనే కానీ నడవలేను. మా అమ్మ సన్యాసమ్మ వృద్ధురాలు. ఇటీవల ప్రమాదంలో ఆమెకు కాలు విరిగిపోయింది. మాకు ఇంకెవరూ లేరు. ప్రతీ నెల ఒకటో తేదీన వచ్చే పింఛన్ నగదే జీవనాధారం. మా ఇద్దరికీ వచ్చే డబ్బులు రోజుకు రూ.200 వంతున లెక్క పెట్టుకుని ఖర్చు చేసుకునేవారం. తిండి, మందులు అన్నీ పెన్షన్ నుంచే ఖర్చు చేసుకుంటాం. చంద్రబాబు, అతని మనుషులు అడ్డుకోవడంతోనే ఈ నెల రెండు రోజులు గడచినా పింఛన్ నగదు అందలేదు. మాలాంటి వారి నోటికాడ తిండి లాగేసే రాక్షసులు ఇంకా ఉన్నారు.

– **తల్లి సన్యాసమ్మతో పాసి కనకరత్నం,** ఇడదాసరిపేట, భీమిలి జోన్

ఉసూరుమంటూ ఎండలో తీసుకెళ్లాలి



నా భర్త కూలి పనులు చేస్తుంటాడు. మా కుమార్తెలలో నాగ గౌరి పుట్టుకతోనే పోలియో బాధితురాలు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని ఆమెకు ప్రతీ నెల రూ.3 వేలు పెన్షన్ వస్తుంది. లేదంటే ఆమెకు కూడా సొంతంగా ఖర్చు చేయాలంటే ఇంకా కష్టపడాల్సి వుంటుంది. వేన్నీళ్లకు చన్నీళ్లు తోడులా వచ్చే పింఛన్ నగదును టీడీపీ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య. వలంటీర్లు ఇంటి వద్ద ఇవ్వకపోవడంతో కిలోమీటరు దూరంలోని నమ్మివానిపేట సచివాలయానికి నాగగౌరిని ఎండలో ఎత్తుకుని తీసుకెళ్లాల్సి వుంటుంది. ఎండతో పింఛనుదారులు, వారి కుటుంబీకులు ఎంత బాధ పడతారో టీడీపీ నాయకులు ఆలోచించరా?

– **కుమార్తె నాగగౌరితో కోల రమణమ్మ,** వలందపేట, భీమిలి జోన్

ఒక్క రోజు ఆలస్యమైనా కష్టమే



కూలి పనులు చేసే నా భర్త దుర్గరాము గతంలో చనిపోయారు. ఇద్దరు కుమార్తెలలో ఏడో తరగతి చదువుతున్న దీపికకు పుట్టు మూగ, చెవుడు. మరో కుమార్తె పదో తరగతి చదువుతుంది. నాకు, దీపికకు పెన్షన్లే ఆధారం. ఇప్పటి వరకు నేను రెండు ఇళ్లల్లో పనులు చేసేదానిని. ఒకరు ఇల్లు మారిపోవడంతో ఇప్పుడు ఇక్క ఇంటిలోనే పని చేసుకుంటున్నా. నాకు వితంతు పెన్షన్, దీపికకు దివ్యాంగ పెన్షన్ వస్తుంది. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయొద్దని చంద్రబాబు అనుచరులు అడ్డుపడడంతో రెండు రోజులైనా మా ఇద్దరికీ పెన్షన్ నగదు అందలేదు. మా లాంటి వారికి ఒక్క రోజు ఆలస్యమైనా కష్టమే.

– **పాసి లక్ష్మి,** సంగివలస, భీమిలి జోన్

చంద్రబాబుకి మా ఉసురు తగులుతుంది



మాకు ప్రతీ నెల కొన్ని ఖర్చులు ఉంటాయి. ఇంట్లో వారిని అడగలేము. వారి దగ్గర డబ్బులు లేక ఇవ్వలేరు. అందువల్ల ఊర్లో దుకాణాల వద్ద అరువులు తీసుకుని కాలం గడుపుతాం. ఒకటో తేదీన పెన్షన్ వస్తుందని మాతో పాటు దుకాణదారులు కూడా ఎదురు చూస్తారు. పెన్షన్ ఆలస్యమైతే మాలాగే దుకాణదారులు ఎదురుచూస్తుంటారు. ఓట్ల కోసం మాలాంటి వృద్ధులను ఉసూరుమనిపించడం చంద్రబాబుకు తగదు. మమ్మల్ని ఏడిపించడం సరికాదు.

– **బోర నారాయణమ్మ,** వృద్ధురాలు, కోరాడపేట, భీమిలి జోన్

పెన్షన్ ఆలస్యమైతే కష్టమే



ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయమే ఇంటి ముందుకు తెచ్చి పెన్షన్ ఇచ్చే వలంటీర్ రెండు రోజులుగా అగుపించడం లేదు. పొరపాటున పెన్షన్లు ఆగిపోయాయేమోనని బాధ పడ్డాను. ఇక్కడి వారిని అడిగితే ఎన్నికల పేరుతో పింఛన్ల పంపిణీకి చంద్రబాబు మనుషులు అడ్డు తగిలారని చెప్పారు. మా లాంటి వారి పెన్షన్లు ఆపితే చంద్రబాబుకు, టీడీపీ నాయకులకు ఏం వస్తుంది. వారి చర్యలతో మా లాంటి వారిమి ఇబ్బంది పడుతున్నాం.

– **ఎరుసు అప్పయ్యమ్మ,** వలందపేట, భీమిలి జోన్

ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందించారు



నా పేరు మేరుగు అప్పన్న. మేము ఉండేది విశాఖ జిల్లా మంగమారిపేట. నేను కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతూ ఆస్పత్రిలో వున్నప్పుడు ఒకటో తేదీన వలంటీర్ నేరుగా నగరంలో ఉన్న ఆస్పత్రికి వచ్చి పెన్షన్ అందించారు. ప్రస్తుతం నాకు డయాలిసిస్ జరుగుతోంది. ఎక్కడకూ వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నాను. నా ఇద్దరు కొడుకులు ఉద్యోగ రీత్యా వైజాగ్‌లో స్థిరపడ్డారు. ఇలాంటి సమయంలో నేను సచివాలయానికి వెళ్లి పెన్షన్ తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నాను. రాజకీయ లబ్ధి కోసం సామాన్య ప్రజలను ప్రతిపక్షాలు ఇబ్బందులు పెట్టడం దారుణం. ఇటువంటి దుర్మార్గపు చర్యలు నేను నా జీవితంలో మొట్టమొదటిసారి చూస్తున్నాను.

– **మేరుగు అప్పన్న,** పింఛనుదారు

సైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న లక్ష్మీకాంతమ్మ

కొమ్మాది: భారత సైనిక దళాల్లో పనిచేస్తూ ఉగ్రవాదుల దాడిలో వీర మరణం పొందిన మాజీ సైనికుడు పి.శ్రీనివాస్ కుటుంబానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మాజీ ప్రొఫెసర్ డి.ప్రసాదరావు ఆర్థిక సహాయం అందించారు. పి.శ్రీనివాసరావు గౌహతి సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది జూలై 29న ఉగ్రవాదులతో పోరాడి వీరమరణం పొందారు. వారి కుటుంబానికి ఎంతో కొంత ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు శ్రీనివాసరావు భార్య పి.శ్రీలక్ష్మికి రూ.50వేలు నగదు ప్రొఫెసర్ ప్రసాదరావు సతీమణి డి.లక్ష్మీకాంతమ్మ మంగళవారం అందజేశారు.

అస్వస్థతకు గురై ఉపాధి కూలీ మృతి



సుంకరి బాలకృష్ణ (ఫైల్)

ఆనందపురం : మండలంలోని గిడిజాల పంచాయతీ వేమగొట్టిపాలెంలో ఉపాధి హామీ పథకం పని కోసం వెళ్లిన కూలీ మంగళవారం అస్వస్థతకు గురై మరణించాడు. ఈ మేరకు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు అధికారులు విచారణ జరిపారు. సుంకరి బాలకృష్ణ (39) మంగళవారం ఉదయం వేమగొట్టిపాలెం గ్రామంలోని గండ్రెడ్డి చెరువులో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనికి వెళ్లాడు. పని చేస్తుండగా గుండెలో నొప్పిగా ఉందని తోటి కూలీలకు చెప్పగా హుటాహుటిన ఇంటికి తీసుకెళ్లారు. పరిస్థితి మరింత విషమించడంతో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్ సత్తిబాబుకు ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వివరాలు సేకరించారు. బాలకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ షిణగం అప్పలరాజు కోరారు.

క్లుప్తంగా

ఘనంగా మరిడమ్మ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు పాత పరదేశిపాలెం గ్రామ దేవత శ్రీ మరిడమ్మ తల్లి మహోత్సవాలు మంగళవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజల్లో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం తప్పెటగుళ్లు, పులి వేషాలతోపాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి బోర రామిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు బోర రాసయ్యరెడ్డి, బోర సాంబమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

8 మద్యం సీసాలు స్వాధీనం

పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒకరిని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పింజెర్ల వాసుదేవరావు రెడ్డిపల్లి నుంచి అనంతవరం బైక్‌పై మద్యం తరలిస్తుండగా మద్ది జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు చిక్కాడు. అతని నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన నాయకుడు




సూరప్పనాయుడుని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం గ్రామానికి చెందిన కర్రోతు సూరప్పనాయుడు మంగళవారం భీమిలిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సూరప్పనాయుడు గత ఎన్నికల్లో జనసేన తరఫున ఆనందపురం – 2 ఎంపీటీసీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. తన అనుచరులతో పార్టీలో చేరిన సూరప్పనాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాల వల్ల పేదలు ఎంతోమంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. అలాగే పార్టీ వేరైనా తనకు కూడా రైతు భరోసా, వాహన మిత్ర వంటి పథకాలు వల్ల లబ్ధి పొందానని, అందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు తెలపడానికి పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఈ సారి కూడా భీమిలి నుంచి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపు ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, చందక అప్పలస్వామి పాల్గొన్నారు.

పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

భీమునిపట్నం: భీమిలి నియోజవర్గ స్థాయిలో పోలింగ్ నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 359 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేస్తున్నామన్నారు. వేసవి కావడంతో తాగు నీరు, నీడ కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు కొత్త ఓటర్లు పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. నాయకులు డీఏఎన్ రాజు, గంటా నూకరాజు, భాగం గోపాలరావు పాల్గొన్నారు.

బీచ్‌లో షూటింగ్ సందడి



హీరో అశ్విన్ బాబు, హీరోయిన్ అయిషాఖాన్

కొమ్మాది: విశాఖ బీచ్ రోడ్డులో మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు ఎం.ఆర్.కృష్ణ తెరకెక్కిస్తున్న వచ్చినవాడు గౌతమ్ సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను రుషికొండ బీచ్, ఆర్కే బీచ్, పోర్టులో హీరో అశ్విన్‌బాబు, హీరోయిన్ అయిషాఖాన్‌పై చిత్రీకరించారు. ఈ సినిమాకు నిర్మాతగా తిమ్మారెడ్డి గణపతి రెడ్డి వ్యవహరిస్తున్నారు.

పేదలకు అండగా నిలిచే ముత్తంశెట్టిని గెలిపించండి



ఏఎస్ఆర్ కాలనీలో ప్రచారం చేస్తున్న పోతిన శ్రీనివాసరావు, తదితరులు



గాయత్రినగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురవాడ: పేదలకు అండగా నిలిచే వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించాలని ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ ఏఎస్ఆర్ కాలనీలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ద్వారా మేలు జరిగిందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, బెల్లాపు పాపారావు, పసుపులేటి గోపి, బంగారు ప్రకాశ్, శ్రీదేవి, తమ్మినేని వరలక్ష్మి, పెంద్ర అప్పన్న, దత్తు వాసు, మగ్గూరి వెంకటరావు, నెంబర్ రమణమ్మ, సతీష్, సీహెచ్‌వీ సత్యనారాయణ, మగ్గూరి వెంకటరావు, బ్రిక్ శ్రీనివాస్, ఎల్లాజీ, దాసరి భాను, వట్టికుల నాగమ్మ, డాక్టర్ సూర్యనారాయణ, సరబత్ శ్రీను, పిళ్లా రమణమ్మ, నాగోతి ధర్మరాజు పాల్గొన్నారు.

పీఎం పాలెం : ఐదేళ్లుగా సంక్షేమ పాలన అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా వున్నారని వైఎస్సార్ న్యాయ విభాగం కార్యదర్శి గాదె రోశిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం గాయత్రినగరలో ఆయన ప్రచారం చేశారు. ఎన్ని పార్టీలు కలిసినా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స ఝాన్సీలక్ష్మి గెలుపు ఖాయమన్నారు. ప్రచారంలో పార్టీ ఆరో వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, పోతిన సూరిబాబు, వెంకటేశ్వర్లు, పోతిన యల్లాజీ, అనూష, వీవీ నరసింహారావు, కాశీప్రసాద్, జామి శివకుమార్ పాల్గొన్నారు.

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు పరిధిలోని నేరెళ్లవలస కాలనీ వద్ద మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు అధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని వివరించారు. దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ ఇంతలా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలు ఎవరూ నమ్మొద్దని కోరారు. ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. బుత్తల ప్రతాప్, గేదెల సత్యనారాయణ, బర్రి రాజు, ఒనము వాసు, దండు గురునాథ్, పైలా సురేష్ పాల్గొన్నారు.



నేరెళ్లవలస కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రూపశ్రీకి న్యాయం కోసం 4న చైతన్య కళాశాల బంద్



కొమ్మాది చైతన్య కళాశాల వద్ద నోటీసు అంటిస్తున్న జన జాగరణ సమితి, బీజేపీ నాయకులు

మధురవాడ: ఫ్యాకల్టీ లైంగిక వేధింపులు, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థిని రూపశ్రీకి న్యాయం చేయాలని ఈ నెల 4 కొమ్మాదిలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాల బంద్ నిర్వహిస్తున్నట్టు జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు చెప్పారు. ఈ మేరకు మంగళవారం కళాశాల వద్ద బీజేపీ నాయకులతో కలిసి నోటీసు అంటించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రూపశ్రీ కుటుంబానికి న్యాయం జరిగి, ఆమె మరణానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులు బహిష్కరించి బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. అలాగే విద్యార్థి, యువజన, మహిళా తదితర ప్రజా సంఘాలు బంద్‌కి సంఘీభావం తెలిపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ధార్మిక సెల్ కో కన్వీనర్ విజయ శంకర్ ఫణీంద్ర, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవీ లత, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ





సంతపేట కొత్తమ్మతల్లి, మజ్జివలస రాస పోలమాంబ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట – కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం తులసిమాలలు, కనకాంబరాలు, కాగడా పూలతో అలంకరించారు. ఈ అలంకరణకు రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో దాతలు జీరు సంతోష్‌రెడ్డి, ఊశెట్టి వెంకటరమణ సహకరించారు. సాడి కుమార్, బోని ఈశ్వర్‌కుమార్, దుంప శంకరరావు అమ్మవారిని అలంకరించారు. మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ, మరిడిమాంబ అమ్మవార్లను మొక్కజొన్న, పువ్వులతో అలంకరించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు

పేదలపై కక్ష కట్టిన పెత్తందారు చంద్రబాబు



ఇడదాసరిపేటలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఆమేయా స్కూల్ రహదారిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఇడదాసరిపేటలో వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్న మహిళలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: పెత్తందారుల ప్రతినిధి చంద్రబాబు పేదలపై కక్ష కట్టి పింఛన్ల పంపిణీని అడ్డుకున్నాడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ రెండో వార్డు సంగివలస పరిధిలోని ఇడదాసరిపేట, ఊళ్లపేట, కోరాడపేట, రజకవీధి, వలందపేట గ్రామాల్లో ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ జరుగుతుంటే ఓర్వలేని చంద్రబాబు అవ్వాతాతల నోటి వద్ద కూడును లాగేసుకున్నాడన్నారు. సీఎం జగన్ మళ్లీ ఇంటింటికీ పింఛన్ల పంపిణీని ప్రారంభింపజేస్తారన్నారు. 30 ఏళ్లుగా డ్రైనేజీలు, రహదారులు లేని ఇడదాసరిపేట వాసులు టీడీపీ హయాంలో కాళ్లరిగేలా తిరిగితే కేవలం కొబ్బరికాయ కొట్టి మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే వలందపేట, ఇడదాసరిపేటలో రూ.1.80 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమల రాకతోపాటు విశాఖ పరిపాలన రాజధాని అవుతుందన్నారు. పొరపాటున చంద్రబాబు గెలిస్తే అవినీతికి లైసెన్స్ ఇచ్చినట్టు అవుతుందన్నారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, అధ్యక్షులు చిల్ల భాస్కరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చిప్పాడ వెంకటేష్, డబ్బీరు ప్రశాంతి, బింగి హరికిరణ్‌రెడ్డి, నమ్మి లక్ష్మణ, జీవీ రమణ, తెడ్లాపు అప్పలరాజు, రమా సత్యనారాయణ ఆలయ చైర్మన్ సరగడ నాగిరెడ్డి, జీరు సుజాత, చిల్ల సూర్యనారాయణరెడ్డి, నమ్మి మాధవ, చేట్ల శ్రీనివాసరెడ్డి, చిల్ల ప్రమీల, జగన్నాథ ఎల్లాజీ, కొసన శ్రీనివాసరెడ్డి, బోర వెంకట అప్పారావు, రాజారావు, కె.రామకృష్ణ, శీరపు నరసింహారావు, మద్ది మహాలక్ష్మి, చేట్ల అప్పలనూరమ్మ, దుర్రి రామయ్యమ్మ, జీరు పద్మ, నగిరెడ్ల రాంబాబు, శీరపు శ్రీరాములు, చేట్ల నరసింగరెడ్డి, గిడుతూరి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి అండగా తెలుకలి సామాజికవర్గం



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న తెలుకలి సంఘం ప్రతినిధులు

తగరపువలస : వైఎస్సార్‌సీపీకి అండగా తెలుకలి సామాజికవర్గం ఉంటుందని మాజీ డిప్యూటీ మేయర్, అఖిల భారత తెలుకలి గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అన్నారు. చిట్టివలస బంతాట మైదానంలో మంగళవారం మధ్యాహ్నం సంఘం స్థానిక అధ్యక్షుడు జామి అప్పలరాజు ఆధ్వర్యంలో తెలుకలి సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాడి మాట్లాడుతూ కుప్పంలో తమ సామాజిక వర్గం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం, రూ.కోటి నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఇచ్చారన్నారు. సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ జిల్లాలో కమ్యూనిటీ హాలు, గానుగలు కోల్పోయిన వారికి పెన్షన్లు, గానుగల నిర్వహణకు ఉచితంగా 300 యూనిట్ల విద్యుత్ సరఫరా చేసేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. సంఘం అధ్యక్షుడు అప్పలరాజు మాట్లాడుతూ తెలుకలి సామాజిక వర్గీయుల ఉపాధి అవకాశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతోపాటు ఎమ్మెల్యే ముత్తంశెట్టి సహకారం వుండాలన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 107 బీసీ కులాలలో 56 కులాలకు సీఎం జగన్ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తే అందులో తెలుకలి కార్పొరేషన్ ఒకటన్నారు. బీసీల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనంతరం తెలుకలి సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి, దేవ తెలుకలి సంఘం అధ్యక్షుడు వీరవెల్లి పెదబాబు, సిటీ సంఘం కన్వీనర్ గొట్టిపల్లి వెంకటరావు, విశాఖ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎ.ఎస్.రాజు, సంఘ నాయకులు కుమిలి సూర్యనారాయణ, అంబటి వెంకటరమణ, జామి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల ఆలస్యం పాపం చంద్రబాబుదే



మధురవాడలో కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు నాయుడు చివరకు అవ్వ, తాతలు, వికలాంగులను కూడా వదలలేదని, వారికి పింఛన్లు అందకుండా అడ్డుపడుతున్నాడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది వికలాంగుల కాలనీ, డ్రైవర్స్ కాలనీల్లో ఆయన మంగళవారం సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయంతోనే వలంటీర్ తెచ్చి పింఛన్ ఇచ్చేవారని, ఇప్పుడు టీడీపీ నాయకుల ఫిర్యాదుల వల్ల పింఛన్ల పంపిణీ ఆలస్యం అయిందన్నారు. స్థానిక నాయకులతో కలిసి కొండవాలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనతోపాటు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు, వంకాయల మారుతీప్రసాద్, పోతిన సురేష్, పూర్ణ, చిరంజీవి రెడ్డి, బండారు శివలక్ష్మి, వంకర అప్పారావు, బోయి సుజాత, బాబ్జి, కూన రమణ, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై పిల్లలను ప్రోత్సహించాలి

తగరపువలస : పుస్తక పఠనంపై పిల్లలను ప్రోత్సహించాలని బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు సూచించారు. మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తకాల ఆవశ్యకతను వివరించారు. డెన్మార్క్‌కు చెందిన రచయిత హాన్స్ క్రిస్టియన్ అండర్సన్ పుట్టినరోజు సందర్భంగా ఈ దినోత్సవం జరుపుతారన్నారు. ఆయన 'ది లిటిల్ మర్మయిడ్' 'ది అగ్లీ డక్లింగ్' పుస్తకాలు రాశారన్నారు. ఆయన గౌరవార్థం 1967 నుంచి స్విట్జర్లాండ్‌లో ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ బోర్డ్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్' సంస్థ 70కు పైగా దేశాల్లో పని చేస్తుందన్నారు. నిజానికి బాల సాహిత్యం పుట్టింది ఇండియాలోనే అన్నారు. క్రీస్తుపూర్వం 200 సంవత్సరంలో విష్ణుశర్మ రచించిన పంచతంత్ర కథలు ఇప్పటికీ ప్రాచుర్యంలో వున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.